



నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

ఎన్టీఆర్ కృష్ణా

గురువారం 3 జులై 2025 పేజీలు 8


### రహదారుల నిర్వహణపై

# ప్రత్యేక దృష్టిపెట్టండి

- ఎన్‌హెచ్‌తో పటిష్ట సమన్వయంతో పనిచేయండి
- ప్రమాదాలు రహిత రహదారుల సాకారానికి కృషిచేయాలి
- గన్నవరం విమానాశ్రయం వరకు క్షేత్రస్థాయి పరిశీలన
- జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ



**ఎన్‌టీఆర్/కృష్ణా జిల్లా బ్యూరో, జులై 02, మేజర్ న్యూస్ :** విజయవాడ నగరంలోని రహదారులతో పాటు గన్నవరం విమానాశ్రయం వరకు ఉన్న రహదారిపై ప్రత్యేకంగా దృష్టిసారించాలని, వాహనదారులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా సాఫీ ప్రయాణానికి వీలుకల్పించేలా జాతీయరహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్ఏఐ) అధికారులతో మునిసిపల్, పంచాయతీరాజ్ తదితర శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ డా. జి.లక్ష్మీశ ఆదేశించారు. బుధవారం కలెక్టర్ లక్ష్మీశ.. కృష్ణా కలెక్టర్ డీకే బాలాజీ, విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్రతో కలిసి గన్నవరం విమానాశ్రయం వరకు రహదారులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మిగతా 2లో



గత ఐదేళ్లు వైసీపీ వేదాద్రి - కంచల ఎత్తిపోతల పథకాన్ని

# మూలపడేసింది

సీఎం చంద్రబాబు నాయుడు, కూటమి ప్రభుత్వం రాకతో

**మళ్ళీ వేదాద్రికి మోక్షం**

రైతులకు సాగునీరు అందించే విధంగా పనులు ప్రారంభం

టీడీపీ నేత, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వర రావు

వివరాలు 7లో



గడప గడపనా ప్రభుత్వ ఖ్యాతి చేరవేయడమే లక్ష్యంగా

# సుపరిపాలనలో తొలి అడుగు

- చరిత్ర సృష్టించేలా పెన్షన్లు అందించిన ఘనత కూటమిదే
- చేసిన మంచిని చెప్పుకోకపోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది
- మంత్రి కొల్లు రవీంద్ర

**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** చేసిన మంచిని ప్రజలకు చెప్పుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై, పాలకుపై ఉందని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. ఈ మేరకు మచిలీపట్నంలోని సుల్తానానగరంలో 2 లో




# జెట్ స్పీడ్‌లో సూపర్ 6

తల్లికి వందనంతో విద్యార్థుల కుటుంబాల్లో ఆనందం

త్వరలో పీ4 లింక్ ద్వారా మహిళలకు ప్రతి నెల రూ.1500 భృతి

ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)

**విజయవాడ మేజర్ న్యూస్ :** గత ప్రభుత్వ హయంలో రాష్ట్ర ప్రజలు సంక్షేమానికి, అభివృద్ధికి దూరంగా వున్నారు. అందుకే ఎన్డీయే కూటమి అధికారంలో రాగానే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సంక్షేమం, అభివృద్ధి పై ప్రత్యేక దృష్టి పెట్టారు. రాష్ట్రంలో లోటు బడ్జెట్ లో వున్న సంక్షేమం, అభివృద్ధి ప్రజలకు చేరువ చేయాలనే లక్ష్యంతో అధికారంలో రాగానే చెప్పిన విధంగా పెన్షన్ వెయ్యి రూపాయలు పెంచి...ప్రతి నెల ఒకటో తారీఖు నాలుగు వేల రూపాయలు ఎన్డీయే కూటమి అందించటంతో పాటు సూపర్ సిక్స్ పథకాలు జెట్ స్పీడ్‌లో అమలు చేస్తోందని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. విజయవాడ పశ్చిమ నియోజకవర్గం 50వ, 55వ డివిజన్ లో ఎంపీ కేశినేని శివనాథ్ సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న, టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి నాగుల్ మీరా, మిగతా 2లో...

# కొత్త చట్టాలు ప్రజల విశ్వాసాన్ని పెంపొందిస్తాయి




**విజయవాడ, జూలై 02, మేజర్ న్యూస్ :** ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నిర్ణయాత్మక నాయకత్వం, కేంద్ర హోంమంత్రి, సహకార మంత్రి అమిత్ షా దూరదృష్టి ఫలితంగా, భారతదేశ నేర న్యాయ వ్యవస్థలో ఒక చారిత్రాత్మక మార్పు సాధ్యమైంది. మొదటిసారిగా, స్వతంత్ర భారతదేశం యొక్క విలువలు, అవసరాలను దృష్టిలో ఉంచుకుని, పౌరులకు న్యాయం యొక్క హామీని ఇవ్వడమే కాకుండా, కాలపరిమితి, పారదర్శక పద్ధతిలో దానిని అందుబాటులోకి తెచ్చే చట్టపరమైన నిర్మాణం తయారు చేయబడింది.'న్యాయ వ్యవస్థపై నమ్మకానికి స్వర్ణ సంవత్సరం' అనే కార్యక్రమాన్ని ఉద్దేశించి కేంద్ర హోం వ్యవహారాలు, సహకార మంత్రి అమిత్ షా మాట్లాడుతూ, 1860 నుండి భారతదేశంలో అమలులో ఉన్న క్రిమినల్ చట్టాలు, ఐపిసి (ఇండియన్ పీనల్ కోడ్), సిఆర్‌పిసి (క్రిమినల్ ప్రొసీజర్ కోడ్), ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్‌లను బ్రిటిష్ పార్లమెంట్ రూపొందించిందని నొక్కి చెప్పారు. పౌరులకు న్యాయం అందించడం కాదు, వలస పాలనను కొనసాగించడం, బ్రిటిష్ పాలకుల ఆస్తి, అధికారాన్ని రక్షించడం వారి లక్ష్యం. ఈ చట్టాల స్ఫూర్తి న్యాయం కాదు, పాలన, అణచివేత. దశాబ్దాలుగా అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వాలు ఈ వలస చట్టాలను నిలుపుకోవడమే కాకుండా వాటిని మార్చడానికి కూడా ప్రయత్నించలేదు.కానీ ఇప్పుడు, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలో, దేశం మొదటిసారిగా, స్వతంత్ర భారతదేశం యొక్క విలువలు, అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రజల భద్రత కోసం కొత్త చట్టాలను రూపొందించింది. కొత్త క్రిమినల్ చట్టాలు, భారతీయ న్యాయ సంహిత, భారతీయ సాక్ష్య అధినియం, భారతీయ నాగరిక్ సురక్ష సంహిత, భారతదేశంలోని ప్రతి పౌరుడు సమానమని, వారి జీవితం, ఆస్తి, గౌరవం, రాజ్యాంగబద్ధంగా అందించబడిన హక్కులు అత్యున్నతమైనవని భావనపై ఆధారపడి ఉన్నాయి. ఈ కొత్త చట్టాల లక్ష్యం పౌరులకు న్యాయం అందించడం, శిక్షించడం మాత్రమే కాదు - వ్యవస్థీకృత నేరం నిర్వచించబడింది, కఠినమైన శిక్షకు నిబంధనలు చేయబడ్డాయి. ఇప్పుడు బాధితుడికి నిందితుడి కంటే ప్రాధాన్యత ఇవ్వబడుతుంది. ఇది "ఎఫ్ఐఆర్ దాఖలు చేయడం వల్ల ఏమీ జరగదు" అనే ప్రజా భావనను తొలగిస్తుంది, దానిని "ఎఫ్ఐఆర్ దాఖలు చేయడం వల్ల తక్షణ న్యాయం లభిస్తుంది" అనే నమ్మకంతో భర్తీ చేస్తుంది.కొత్త చట్టాల యొక్క అతిపెద్ద లక్షణం ఏమిటంటే అవి కాలానుగుణ న్యాయాన్ని నిర్ధారిస్తాయి. ఇప్పుడు, నేర దర్యాప్తు నుండి కోర్టు తీర్పు వరకు అన్ని దశలను ఒక నిర్ణీత కాలక్రమంలోకి తీసుకురాబడింది. ప్రతి ఎఫ్ఐఆర్ కోసం ఒక డిజిటల్ రికార్డును తయారు చేస్తారు, ప్రతి కేసును సాంకేతిక ద్వారా ట్రాక్ చేస్తారు, బాధితుడు ప్రతి దశలో సమాచారాన్ని అందుకుంటారు. ఇది పోలీస్, న్యాయ వ్యవస్థలో పారదర్శకతను తీసుకురావడమే కాకుండా అవినీతి, నిర్లక్ష్యాన్ని కూడా అరికడుతుంది.మోడీ ప్రభుత్వ నాయకత్వంలో రూపొందించిన ఈ కొత్త చట్టాలను అమలు చేస్తున్నప్పుడు, సాంకేతికతను విస్తృతంగా ఉపయోగించారు. కేసు ప్రాసెసింగ్ వేగంగా, మరింత ఖచ్చితమైనదిగా ఉండేలా చూసుకోవడానికి డిజిటల్ ఫోరెన్సిక్స్, వీడియో కాన్ఫరెన్సింగ్, ఎలక్ట్రానిక్ ఆధారాల గుర్తింపు, రియల్-టైమ్ అప్‌డేట్‌లు వంటి చర్యలు చేర్చబడ్డాయి. ఇప్పుడు, పోలీసు దర్యాప్తులకు పరిమిత సమయం, తప్పనిసరి ఫోరెన్సిక్ ఆధారాలు, కేసు ట్రాకింగ్ వ్యవస్థ చట్టంలో భాగమయ్యాయి. సామాన్యుడు ఇకపై పోలీస్ స్టేషన్‌కు వెళ్లడానికి భయపడడు. బదులుగా, అతను అక్కడికి వెళ్లి స్వేచ్ఛగా మాట్లాడతాడు, అతనికి న్యాయం లభిస్తుందనే నమ్మకం ఉంటుంది.నరేంద్ర మోడీ నాయకత్వంలో, ప్రభుత్వం ఇప్పుడు దేశవ్యాప్తంగా ఈ చట్టాల గురించి అవగాహన ప్రచారాన్ని నిర్వహిస్తోంది, తద్వారా ప్రతి పౌరుడు, న్యాయవాది, పోలీసు అధికారి, న్యాయ అధికారి ఈ చట్టాల స్ఫూర్తిని అర్థం చేసుకుని వాటిని ఆచరణలో పెడతారు.భారత చట్టంలో ఈ మార్పు దేశ ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేస్తుంది, ఇక్కడ పౌరులకు సకాలంలో న్యాయం, సమానత్వం, గౌరవం లభిస్తుంది. ఈ కొత్త చట్టాల మొదటి సంవత్సరం విజయం భారతదేశ నేర న్యాయ వ్యవస్థ ఇప్పుడు కొత్త యుగం వైపు పయనిస్తోందనడానికి సానుకూల సూచన - ఈ యుగం లో ప్రజలు ఆలస్యం లేకుండా న్యాయం అందుతుందని దృఢంగా నమ్ముతారు. ఈ కొత్త చట్టాలు పూర్తిగా అమలు చేయబడిన తర్వాత, అంతులేని వాయిదాల చక్రం ముగుస్తుంది, ఎఫ్ఐఆర్ దాఖలు చేసినప్పటి నుండి కేవలం మూడు సంవత్సరాలలో న్యాయం అందించబడుతుంది.

## సోనీ ఇండియా నుంచి బ్రావియా థియేటర్ సిస్టమ్ 6, బార్ 6 సౌండ్‌బార్లు




**విజయవాడ మేజర్ న్యూస్ :** బ్రావియా థియేటర్ బార్ 6 (వైర్‌లెస్ సబ్ వూఫర్‌తో 3.1.2 ఛానెల్ సౌండ్‌బార్), బ్రావియా థియేటర్ సిస్టమ్ 6 (వైర్‌లెస్ రియర్ స్పీకర్లతో 5.1 ఛానెల్ హోమ్ థియేటర్ సిస్టమ్) విడుదల చేయటం ద్వారా సోనీ ఇండియా తమ బ్రావియా థియేటర్ పోర్ట్‌ఫోలియోను విస్తరించింది. సినిమాటిక్ ఆడియోను ఇంటికి తీసుకురావడానికి రూపొందించబడిన ఈ సౌండ్‌బార్‌లు శక్తివంతమైన సరౌండ్ సౌండ్, సౌకర్యవంతమైన బ్రావియా టీవీ ఇంటిగ్రేషన్, ప్రతి సినిమా, గేమ్, కచేరీ అనుభవాన్ని మెరుగుపరచడానికి రూపొందించిన ఇంటెలిజెంట్ సౌండ్ టెక్నాలజీలను అందిస్తాయి. సోనీ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ సునీల్ నయ్యర్ ఈ సందర్భంగా మాట్లాడుతూ, "బ్రావియా థియేటర్ సిస్టమ్ 6, బార్ 6లతో, మేము భారతీయ గృహాలలో నిజంగా సినిమాటిక్ అనుభవాన్ని అందిస్తున్నాము. ఈ ఉత్పత్తులు అత్యుత్తమ సాంకేతికత, ఆవిష్కరణలను అందిస్తాయి. డాల్బీ అట్మాస్, వైర్‌లెస్ సౌలభ్యంతో పాటు శక్తివంతమైన 1000 వాట్ లీనమయ్యే శబ్ద అనుభవాన్ని అందిస్తున్నాయి. భారతీయ వినియోగదారులు మరింత గొప్ప ఆడియో విజువల్ అనుభవాలను డిమాండ్ చేస్తున్నందున, ఈ శ్రేణి ప్రీమియం హోమ్ ఎంటర్‌టైన్‌మెంట్ విభాగంలో కొత్త ప్రమాణాలను ఏర్పాటు చేస్తుందని మేము విశ్వసిస్తున్నాము" అని అన్నారు.

## కరూర్ వైశ్యా బ్యాంక్ తో క్షేమ జనరల్ ఇన్సూరెన్స్ బ్యాంకెష్యూరెన్స్ భాగస్వామ్యం





**విజయవాడ మేజర్ న్యూస్ :** భారతదేశపు గ్రామీణ, వ్యవసాయ ఆధారిత వర్గాలకు జంట ప్రయోజనం చేకూర్చేలా ప్రత్యేకంగా రూపొందించిన క్షేమ కిసాన్ సాథి బీమా పథకాన్ని అందించేందుకు కరూర్ వైశ్యా బ్యాంక్ (కేవీబీ), క్షేమ జనరల్ ఇన్సూరెన్స్ లిమిటెడ్ సంస్థలు వ్యూహాత్మక బ్యాంకెష్యూరెన్స్ భాగస్వామ్య ఒప్పందం కుదుర్చుకున్నాయి. కేవీబీ యొక్క గ్రామీణ, సెమీ అర్బన్ బ్యాంకింగ్ సామర్థ్యాలు, క్షేమ యొక్క సాంకేతికత ఆధారితమైన బీమా సేవల దన్నుతో అసంఖ్యాక కస్టమర్లకు సంపూర్ణ ఆర్థిక భద్రత కల్పించేందుకు ఇది తోడ్పడనుంది. కేవీబీ, క్షేమ మధ్య భాగస్వామ్యమనేది భారతదేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక లాంటి రైతులు, గ్రామీణ ప్రాంతాల ఎంట్రప్రెన్యూర్లకు భద్రత, స్థిరత్వం, ఎదిగేందుకు భరోసాను కల్పించాలన్న ఉమ్మడి లక్ష్య సాకారానికి కూడా తోడ్పడుతుంది.

## ఖరీదైన ఉచిత దంత వైద్యం - పూర్తి పళ్ళ సెట్లు పంపిణీ



**గుడ్లవల్లేరు మేజర్ న్యూస్ జూలై 02:** గుడ్లవల్లేరు మండలం సింగలూరులో రెండు రోజుల పాటు నిర్వహించిన అత్యంత ఖరీదైన ఉచిత దంత వైద్యానికి విశేష ప్రజా స్పందన లభించింది. బుధవారం స్థానిక భాగ్య విధాత చారిటబుల్ ట్రస్ట్ అధినేత డాక్టర్ బందారు శ్యామ్‌కుమార్, సరస్వతి దంపతుల ఆధ్వర్యంలో అత్యంత విలువైన రిమూవబుల్ కంప్లీట్ డెంచర్(తీసి పెట్టుకునే పూర్తి పళ్ల సెట్)లను ఉచితంగా అవసరమైన పేషెంట్లకు అందించారు. గుంటూరు సిబార్ దంత వైద్య కళాశాల రజతోత్సవ వేడుకల్లో భాగంగా సింగలూరు బందారు బ్రహ్మారావు, సీతామహాలక్ష్మి మెమోరియల్ కమ్యూనిటీ హాల్‌లో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. మచిలీపట్నం, గుడివాడ, అంగలూరు, గుడ్లవల్లేరు, పెడన, గూడూరు, పెనమలూరు వంటి వివిధ ప్రాంతాల నుంచి ఈ కార్యక్రమానికి పేషెంట్లు హాజరయ్యారు. గుంటూరు సిబార్ డెంటల్ వైద్య విభాగం వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ మన్నె ప్రకాష్, హెచ్‌వోడీ డాక్టర్ కడియాల కృష్ణకిషోర్‌తో పాటు వైద్యులు, సిబ్బంది 30మందికి పైగా ఈ వైద్య సేవలను అందించారు. గ్రామ కార్యదర్శి చాపరాల రాజేష్, గుడ్లవల్లేరు సాయి విద్యానికేతన్ అధినేత శింగంశెట్టి ఆదినారాయణ(చిన మాస్టారు), గ్రామస్తులు ఉద్దంటి శివనాగ మల్లేశ్వరరావు, కోటా పైడేశ్వరరావు, మాచర్ల రమణయ్య, బిట్ర అర్జునరావు, దోనేపూడి ప్రసాద్, ఆకురాతి రాఘవయ్య తదితరులు పాల్గొన్నారు.

## తోట్లవల్లూరు మండల టీడీపీ అధ్యక్షునిగా 'శివరాం' తిరిగి ఎన్నిక



**తోట్లవల్లూరు జూలై 2 మేజర్ న్యూస్ :** పామర్రు నియోజకవర్గం పరిధిలోని తోట్లవల్లూరు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షునిగా వీరవనేని శివరాం ప్రసాద్ తిరిగి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండలంలోని గరికపర్రు గ్రామంలో గల సాయి సదన్ కళ్యాణ మండపంలో నిర్వహించిన మండల పార్టీ సర్వసభ్య సమావేశంలో ఈ మేరకు నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా శివరాం ప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా వీరంకి పరుశురాం లను ఎన్నుకున్నారు. మండలంలోని 16 గ్రామాలకు చెందిన గ్రామ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు పలువురు నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొని మండల కమిటీని ఏకగ్రీవంగా ప్రతిపాదించారు. నియోజకవర్గ పరిశీలకులు కోట వీరబాబు పర్యవేక్షణలో మండల కమిటీ ఎన్నిక జరిగింది. ఎన్నడూ లేనివిధంగా తోట్లవల్లూరు మండలంలో తెలుగుదేశం పార్టీ గత ఎన్నికలలో పూర్తిస్థాయిలో మెజార్టీ సాధించేందుకు కృషి చేసిన శివరాం ప్రసాద్ ను తిరిగి అధ్యక్షునిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి, వాణిజ్యవిభాగం రాష్ట్ర ఉపాధ్యక్షులు చింతపల్లి వెంకటేశ్వరరావు, ఉమ్మడి కృష్ణా జిల్లా తెలుగు యువత మాజీ అధ్యక్షులు రామినేని వెంకట బసవ కుటుంబరావు, పార్టీ సీనియర్ నాయకుడు, బొడ్డపాడు గ్రామ సర్పంచ్ మూడే శివశంకరరావు, ఉయ్యూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చాగంటి తిమ్మారెడ్డి తదితర నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏకగ్రీవంగా ఎన్నికైన మండల పార్టీ అధ్యక్ష, కార్యదర్శులు శివరాం ప్రసాద్, పరశురాం లను పలువురు నాయకులు దుశ్శాలువ, పూలమాలతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ నూతన కమిటీ నేతృత్వంలో రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా తెలుగుదేశం పార్టీ అభ్యర్థులను గెలిపించి తీరుతామని ఈ సందర్భంగా పలువురు నాయకులు, కార్యకర్తలు పేర్కొన్నారు.



## అధికారులకు రైతుల గోడు పట్టదా ?

### మండిపడ్డ ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి పివి ఆంజనేయులు

**కంచికచర్ల జూలై 2 మేజర్ న్యూస్ :** భూమి రైతులుది పెత్తనం క్రషర్ యాజమాన్యం దా అని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి పివి ఆంజనేయులు మండిపడ్డారు. మండలంలోని పరిటాల పరిధిలోగల క్వారీల,క్రషర్ల వద్ద రైతుల నిరంతర నిరసన కార్యక్రమానికి బుధవారం పివి ఆంజనేయులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారుల నిర్లక్ష్యంతో రైతులకు కష్టాలు మరింత పెరిగాయి అన్నారు.క్వారీ లో రిగ్ బ్లాస్టింగ్ తక్షణమే ఆపాలని డిమాండ్ చేశారు.రైతు కు కష్టం వస్తే అధికారులు స్పందించరా అని ప్రశ్నించారు. రైతులను ఇబ్బందులు పెడుతున్న క్వారీ యాజమాన్యం పై చర్యలు ఎందుకు తీసుకోరని ఆగ్రహం వ్యక్తం చేశారు. మైనింగ్ అధికారుల కాసుల మత్తు లో మునిగి బఫర్ జోన్ పరిధి పెంచుకోవాలనే దురుద్దేశంతో క్రషర్ యజమానులు చూస్తున్నారని తక్షణమే జిల్లా కలెక్టర్ స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.దేశానికి అన్నం పెట్టే రైతుల కంటనీరు సుభిక్షం కాదని హెచ్చరించారు.రైతులను ఇబ్బంది పెడుతున్న క్వారీ యాజమానుల పై తక్షణం చర్యలు తీసుకోవాలన్నారు. పొల్యూషన్ నుండి రైతులపంట పొలాలను కాపాడాలన్నారు.ఎన్ యస్ పి కాలువను మాయం చేసేందుకు క్రషర్ల యాజమాన్యం కుట్ర చేస్తుందన్నారు.ఎన్ యస్ పి కాలువను మింగేస్తు అక్రమ రోడ్డు నిర్మాణానికి యత్నిస్తున్నారన్నారు. వ్యవసాయం కనుమరుగైపోయే ప్రమాదం పొంచి ఉంది అని ఆవేదన వ్యక్తం చేశారు.రాయచోటి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి బినామీల క్వారీల నుంచి రైతాంగాన్ని కాపాడండి అనే వేడుకున్నారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కోట కళ్యాణ్, రైతులు ఎ.మల్లేశ్వరరావు, నరసింహారావు,వీరయ్య, హనుమంతరావు, వెంకటేశ్వరరావు,మైసూర్, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

# విజయదుర్గా విలాస్ చౌదరి మిలటరీ హోటల్‌కు నోటీసులు జారీ





నందిగామ :జూలై 2 మేజర్ న్యూస్ : నందిగామ పట్టణం పాత బస్టాండ్ సెంటర్లో ఉన్న విజయదుర్గా విలాస్ (చౌదరి మిలటరీ హోటల్) యజమానికి ప్రభుత్వం నిబంధనలకు విరుద్ధంగా హోటల్ నిర్వహించడంపై ఫుడ్ సేఫ్టీ అధికారులు నోటీసులు జారీ చేయడం జరిగింది అని ఫిర్యాదుదారుడు సి హెచ్ శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో విజయ దుర్గా విలాస్ హోటల్ యాజమాన్యం పై ఫిర్యాదు మేరకు ఎన్టీఆర్ జిల్లా అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ బి. శ్రీనివాస రావు ఆదేశాల మేరకు ఫుడ్ సేఫ్టీ అధికారి ఎస్ రవీందర్ రెడ్డి మంగళవారం తనిఖీలు నిర్వహించడం జరిగింది. అనంతరం ఫిర్యాదుదారుడు సమక్షంలో విచారణ చేపట్టకుండా ఫుడ్ సేఫ్టీ అధికారి ఎస్ రవీందర్ రెడ్డి ఏకపక్షంగా తనిఖీలు నిర్వహించి హోటల్ యాజమాన్యానికి అనుకూలంగా వ్యవహరించినట్లు శ్రీనివాస రావు పేర్కొన్నారు. హోటల్ యాజమాన్యం వారు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా హోటల్ నిర్వహణ చేపట్టినప్పటికీ ఎటువంటి చర్యలు తీసుకోకుండా కేవలం నోటీసులు మాత్రమే జారీ చేసి ఫిర్యాదును నీరుగారిచే విధంగా వ్యవహరించాలని ఆయన ఆరోపించారు. హోటల్ యాజమాన్యం వారు కనీసం ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఫుడ్ సేఫ్టీ అనుమతులు, మరుగుదొడ్లు, పారిశుధ్యం, నాణ్యత, కార్మికులు పరిశుభ్రంగా లేకపోవడం తదితర అంశాలు లేకపోయినప్పటికీ ఫుడ్ సేఫ్టీ అధికారి హోటల్ యాజమాన్యం వారికి అనుకూలంగా జిల్లా ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చినట్లు తెలిపారు. కనుక ఇప్పటికైనా సంబంధిత జిల్లా అధికారులు విజయదుర్గ విలాస్ (చౌదరి మిలటరీ హోటల్) యాజమాన్యంపై సమగ్ర విచారణ జరిపించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని చింతా శ్రీనివాసరావు కోరారు.



## వాసవి ఆలయ పనులు పరిశీలించిన ఎమ్మెల్యే

అవనిగడ్డ మేజర్ న్యూస్ : ఆర్యవైశ్యుల ఆరాధ్య దేవత వాసవీ మాత ఆలయం త్వరితగతిన పూర్తి ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఆకాంక్ష వ్యక్తం చేశారు. బుధవారం మధ్యాహ్నం స్థానిక గుర్రప్ప చెరువు గట్టున నిర్మాణం జరుగుతున్న శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయ నిర్మాణ పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. వీలైనంత త్వరగా నిర్మాణం పనులు పూర్తి చేయాలని ఆలయ కమిటీ వారికి సూచించారు. ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షులు ఘంటసాల రాజమోహనరావు (కన్నయ్య) ఆలయ నిర్మాణం గురించి వివరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ పెద్దలు అద్దేపల్లి నాంచారయ్య, నంబూరి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

## రైతుల కోసం సమర్థవంతమైన డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు



చల్లపల్లి మేజర్ న్యూస్: రైతులకు సమర్థవంతమైన డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేస్తున్నట్లు అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. బుధవారం చల్లపల్లి మండలం లక్ష్మీపురం వద్ద గుండేరు మేజర్ డ్రైనేజీలో గుర్రపు డెక్క, తూటికాడ నిర్మూలనకు డ్రోన్ ద్వారా మందు స్ప్రేయింగ్ పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుండేరు మేజర్ డ్రైనేజీలో 19 కిమీ నుంచి 61.6కిమీ వరకూ 42.50 కిలోమీటర్ల పరిధిలో ఆపరేషన్స్ అండ్ మైంటెనెన్సు పనుల నిధులు రూ.27.27 లక్షలతో పమిడి ముక్కల మండలం ఫతేలంక నుంచి చల్లపల్లి మండలం మాజేరు వరకూ ఈ పనులు చేపట్టినట్లు వివరించారు. కూటమి ప్రభుత్వం వ్యవసాయంలో డ్రోన్ టెక్నాలజీ విశేషంగా ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. రైతులకు సబ్సిడీపై డ్రోన్లు అందిస్తున్నట్లు తెలిపారు. డ్రోన్ల వినియోగం ద్వారా వ్యవసాయ పనులు సులభతరం అవుతున్నాయన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ యువనాయకులు మండలి వెంకట్రామ్, టీడీపీ మండల అధ్యక్షులు తుమ్మల చౌదరి బాబు, శ్రీకాకుళం డీసీ చైర్మన్ అయినపూడి భానుప్రకాష్, డీసీ వైస్ చైర్మన్ పరిశే చలపతిరావు, ఎంపీటీసీ సభ్యులు వెంకటేశ్వరరావు (చిన్నా), డ్రైనేజీశాఖ డీఈఈ బాబూనాయక్, నాయకులు, రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

# మూకల అప్పారావు సేవలు మరువలేనివి



విజయవాడ మేజర్ న్యూస్ : గాంధీనగర్ ఏపీ ఎన్జీవో హోమ్‌లో బుధవారం మూకల అప్పారావు స్మారక ప్రతిభా పురస్కారాలు" ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో విశిష్ట అతిథి మాజీ ఎమ్మెల్సీ పర్చూరి అశోక్ బాబు మాట్లాడుతూ ప్రభుత్వం విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని, ఉపాధ్యాయులందరూ విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాలని సూచించారు. డాక్టర్ మాజీ ఏ.యస్. రామకృష్ణ మాట్లాడుతూ మూకల అప్పారావు ఉపాధ్యాయుల శ్రేయస్సు, విద్యార్థుల కోసం నిరంతరం పరితపించేవారని కొనియాడారు. ఏపీ ఎన్జీవో అధ్యక్షులు ఏ. విద్యాసాగర్ మాట్లాడుతూ మూకల అప్పారావు తో తన అనుబంధం 20 సం.ల నాటిదని, 'నోబుల్ టీచర్స్ అసోసియేషన్ ఆయన పేరుతో విద్యాలోకానికి అవార్డులు ప్రధానం చేయడం సంతోషించదగ్గ విషయమని తెలిపారు. నోబల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.శ్రీనివాస రాజు, బి.హైమారావు మాట్లాడుతూ వ్యవస్థాపక అధ్యక్షులు మూకల అప్పారావు సంఘానికి చేసిన సేవలను వివరించారు. విజయవాడ నగర పాలక సంస్థలో 138 ఉపాధ్యాయుల పదోన్నతికి మూకల అప్పారావు స్ఫూర్తి అని తెలియచేశారు. ఈ కార్యక్రమంలో 14 మంది విద్యార్థులకు నగదు బహుమతి, 50 మంది ప్రధానోపాధ్యాయులకు సత్కారం, ఎస్ఎస్ సీ మార్చి 2025 లో 100% ఉత్తీర్ణత సాధించిన దాదాపు 170 మంది ఉపాధ్యాయులను సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి జూలపల్లి శ్రీనివాసరావు, రాష్ట్ర మైనారిటీ కన్వీనర్ షేక్ ముజాహిద్దిన్, రాష్ట్ర నాయకులు బి.వి.ఎన్.సోమసుందరరావు, విటిఆర్ నెహ్రూ, జిల్లా అధ్యక్షులు వి.శేషగిరిరావు, జిల్లా ఆధిక కార్యదర్శి వి.యస్.మన్మధ, విజయవాడ నగర అధ్యక్ష కార్యదర్శులు గణేష్, యాసం చంటిబాబు, మూకల అప్పారావు మిత్రబృందం పాల్గొన్నారు.

# రూ.2.40 కోట్లతో పూషడం, మల్లాయి చిట్టూరు తారు రోడ్ల శంకుస్థాపన

## ఎన్డీఏ కూటమితోనే రాష్ట్ర ప్రగతి- ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్





ఘంటసాల, మేజర్ న్యూస్: వైసీపీ పాలనతో రాష్ట్రం అస్తవ్యస్తంగా మారిన సమయంలో పవన్ కళ్యాణ్ చొరవతో ఏర్పడిన ఎన్.డీ.ఏ కూటమి రాష్ట్ర ప్రగతి అని స్థానిక శాసనసభ్యులు మండలి బుద్ధప్రసాద్ అన్నారు. బుధవారం ఘంటసాల మండలంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులు రూ.2.40 కోట్లతో రెండు తారు రోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ శంకుస్థాపనలు చేశారు. రూ.కోటీ నలభై లక్షలతో జాతీయ రహదారి-216 నుంచి పూషడం వరకూ మూడు కిలోమీటర్ల తారు రోడ్డు, రూ.కోటితో పూషడం నుంచి మల్లాయి చిట్టూరు వరకూ రెండు కిలోమీటర్ల తారు రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే శ్రీకారం చుట్టారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నుంచి సంపూర్ణ సహకారంతో అభివృద్ధి చేస్తున్నామనిరు. పల్లె సీమల అభివృద్ధితోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. పల్లె పండుగ కార్యక్రమం తో మంజూరు చేసిన రూ.32.24 కోట్లతో నియోజకవర్గంలో 56 కిలోమీటర్ల మేర అంతర్గత రహదారులను సీసీ రోడ్లుగా అభివృద్ధి చేసినట్లు తెలిపారు. ఉపాధి నిధులతో తారు రోడ్లు నిర్మించాలనే ఆలోచనతో పూషడం, మల్లాయి చిట్టూరు ప్రజల విజ్ఞప్తి దృష్టిలో ఉంచుకుని ఈ రెండు తారు రోడ్లు మంజూరు చేసినట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం తొలి ఏడాదిలోనే కోడూరు - అవనిగడ్డ సహా అనేక ప్రధాన రహదారులు నిర్మాణం పూర్తి చేశామన్నారు. నియోజకవర్గంలో మిగిలిన రోడ్లు కూడా తారు రోడ్లుగా అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే ప్రకటించారు. వైసీపీ ప్రభుత్వం ఈ గ్రామాల రైతులు ఎదుర్కొనే ముంపు సమస్యలను నిర్లక్ష్యం చేస్తే తమ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే నియోజకవర్గంలో ముంపు నివారణకు యుద్ధప్రాతిపదికన పనులు చేయించినట్లు తెలిపారు. గత ప్రభుత్వం రైతులను ఆఫ్ లైన్, ఆన్లైన్ పేరుతో ఇబ్బంది పెట్టడమే కాకుండా ధాన్యం సొమ్ము రూ.1,600 కోట్లు బకాయి పెట్టి పోతే తమ కూటమి ప్రభుత్వం తీర్చిందన్నారు. తమ ప్రభుత్వం 48 గంటల్లో ధాన్యం సొమ్ము జమ చేస్తామని చెప్పి 24 గంటల్లోనే చెల్లించినట్లు తెలిపారు. ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, ప్రజలు మాట్లాడుతూ తమ ప్రధాన రహదారి సమస్య పరిష్కారం చేసిన ఎమ్మెల్యేకు బుద్ధప్రసాదుకు ధన్యవాదములు తెలిపారు. నియోజకవర్గ యువ నాయకులు మండలి వెంకట్రామ్, టీడీపీ మండల అధ్యక్షులు తుమ్మల చౌదరి బాబు, డీసీ చైర్మన్ అయినపూడి భానుప్రకాష్, ఏఎంసీ చైర్మన్ తోట కనకదుర్గ, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ నందూరి రాజేంద్రప్రసాద్, సర్పంచ్ అంకం మారుతీరావు, మల్లాయి చిట్టూరు సర్పంచ్ ఆవుల రేవతి, యండకుదురు సర్పంచ్ ముళ్లపూడి పట్టాభి రామారావు, ఎంపీటీసీ సభ్యులు సిద్దినేని కుమార్ రాజా, తాడికొండ వెంకటేశ్వరరావు (చిన్నా), నీటి సంఘం అధ్యక్షులు ఆవుల ధర్మ వెంకట నరసయ్య, ఎంపీడీఓ సుబ్బారావు, పంచాయతీరాజ్ డీఈఈ పగడాల సురేష్ బాబు, జనసేన పార్టీ ఘంటసాల, చల్లపల్లి మండలాల అధ్యక్షులు కోన రాజశేఖర్, చోడగం విమల్ కృష్ణ, డీసీ వైస్ చైర్మన్ పరిశే చలపతి, టీడీపీ నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షులు దిరిశం వెంకట్రావ్, కూటమి నాయకులు లోయ నాగ శ్రీనివాసరావు, కూనసాని పరమేశ్వరరావు, తుమ్మల నందేశ్వరరావు, గళ్ళా నాగమల్లేశ్వరరావు, మట్టా ప్రియానందం, చీదేపూడి శ్రీనివాసరావు, సుగ్గన పవన్ కుమార్, కొండవీటి శ్రీనివాసరావు, యార్ల శ్రీకాంత్, బొందలపాటి వీరబాబు, గళ్ళా పరశురామ్, కోలపల్లి శ్రీవర్ష, కిరణ్, మడమల రంజిత్, అడపా రవి, గోళ్ళ ప్రసాద్, వివిధ శాఖల అధికారులు, కూటమి కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పునర్నిర్మాణ యుగం ప్రారంభమైంది





**ప్రజల అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యం**

**ప్రతి కుటుంబానికి జీవన స్థితిని కల్పించేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది**

**టీడీపీ నేత మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వర రావు**

**నందిగామ, జూలై 2, మేజర్ న్యూస్:** సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వర రావు పాల్గొన్నారు. బుధవారం నందిగామలో పార్టీ శ్రేణులతో కలిసి సుపరిపాలనలో తొలి అడుగు కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దేవినేని ఉమామహేశ్వర రావు మాట్లాడుతూ, తెలుగుదేశం పార్టీ ప్రజల సంక్షేమం కోసం, ముఖ్యంగా రైతులు, మహిళలు, యువత, వెనుకబడిన వర్గాల అభ్యున్నతి కోసం నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. "సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం ద్వారా ప్రజలకు మెరుగైన సేవలను అందించడంతో పాటు, పాలనలో జవాబుదారీతనం, పారదర్శకతను నిర్ధారించడమే కూటమి లక్ష్యం," అని ఆయన అన్నారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సూపర్ సిక్స్ పథకాలపై ప్రతి ఇంటిలోకి వెళ్లి గడపగడపకూ చంద్రబాబు నాయుడు సంకల్పాన్ని చాటిచెప్పాలన్నారు. గత ఐదేళ్లలో వైసీపీ హయాంలో జరిగిన నష్టంతో పాటు ఏడాది కాలంలోనూ ప్రజలుమెచ్చిన పాలన అందించామని గణాంకాలతో అందించాలని వివరించారు. అత్యధిక కుటుంబాలకు మేలు చేకూర్చేలా తల్లికి వందనం కింద గతంలో ఒక్కరికే రూ.15 వేలు చెల్లిస్తే, ఇప్పుడు ఇద్దరికి మించి పిల్లలున్న వారందరికి రూ.30 నుంచి 60వేల వరకు తల్లి ఖాతాలో జమ చేసిన విషయానికి ప్రాధాన్యత వివరించాలన్నారు. పట్టణప్రాంతాల్లో చెత్తపన్ను రద్దు చేయడం, పేదల కోసం అన్నక్యాంటీన్లను ప్రారంభించడం, నెలవారీ పింఛన్‌ను రూ.నాలుగు వేలకు పెంచడం, ఉపాధ్యాయులను ఇబ్బంది పెట్టే జీవో 117 రద్దు, ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం, మెగా డీఎస్సీ, ఒంటరి మహిళలకు పింఛన్లు, డ్వాక్రా సంఘాల్లో రుణ వితరణలో ప్రాధాన్యత వంటి అంశాలతో పాటు ఉచితగ్యాస్ పథకమే కాకుండా కొద్దిరోజుల వ్యవధిలోనే అన్నదాత సుఖీభవ కింద రైతులకు అండగా నిలవడం, ఆగస్టు నుంచి మహిళలందరికి ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్న విషయాన్ని ప్రజలకు వివరించేందుకు అడుగులు వేస్తున్నామని దేవినేని ఉమ చెప్పుకొచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ మండవ కృష్ణకుమారి డీసీ చైర్మన్ రాటకొండ చంద్రశేఖర్, మండల గ్రామ, పట్టణ నేతలు కూటమి నేతలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## పాఠశాలలు, కళాశాలల వద్ద డ్రోన్ కెమెరాలతో పోలీసుల నిఘా

**పామర్రు జూలై 2 మేజర్ న్యూస్:** పామర్రు మండలంలోని వివిధ గ్రామాల్లో పాఠశాలల వద్ద స్థానిక పోలీసులు డ్రోన్ కెమెరాల ద్వారా నిఘా ఏర్పాటు చేశారు. పామర్రు లోని శ్రీ కంచర్ల రామారావు జిల్లా పరిషత్ హైస్కూలు, ప్రసన్న జూనియర్ కాలేజీ, జుజ్జువరం గ్రామంలోని ఉషోదయ స్కూల్ వద్ద మైనర్ బాలురు, బాలికలు వాహనం నడుపుట గురించి, ఈవ్ టీజర్స్ గురించి డ్రోన్ కెమెరా ద్వారా నిఘా ఏర్పాటు చేయడం జరిగిందని ఎస్సై వి రాజేంద్రప్రసాద్ తెలిపారు. దానిలో భాగంగా కొంతమందిని అదుపులోకి తీసుకుని వారికి తగిన వయసు రాకుండా వాహనం నడిపితే ఏ విధమైన పరిణామాలు ఏర్పడతాయో, అలాగే వాహన చట్టం గురించి అవగాహన కల్పించామన్నారు. పాఠశాలలు, కాలేజీల వద్ద వాహనాలు అతివేగంగా నడుపుతూ స్కూల్ పిల్లలకు, కాలేజీ పిల్లలకు ఇబ్బందికరంగా తిరుగుతున్న కొంతమందికి హెచ్చరికలు జారీ చేసి మొదటి తప్పుగా తెలియపరచి వాళ్ళని విడిచి పెట్టడం జరిగిందన్నారు. అదేవిధంగా పామర్రు మండలంలోని జూనియర్ కళాశాలలు, పాఠశాలల వద్ద డ్రోన్ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేయడం జరుగుతోందని ఎస్ఐ రాజేంద్రప్రసాద్ తెలిపారు.



# సుపరిపాలనలో తొలి అడుగు





**పామర్రు జూలై 2 మేజర్ న్యూస్:** సుపరిపాలనకు తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను పామర్రు శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా వివరించారు. ప్రతి ఇంటిలోనూ ఉన్న సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కుమార్ రాజా మాట్లాడుతూ పేదరికానికి ముగింపు ఇచ్చేలా మద్దతు ధరలు, పంటలబీమా, ఉచిత బోర్‌వెల్స్, పెన్షన్లు, ఆరోగ్యశ్రీ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో మెరుగైన సేవలు, విద్యార్థులకు తల్లికి వందనం, పాఠశాలల ఆధునీకరణ, మహిళలకు డ్వాక్రా బలోపేతం, ఉచిత రేషన్, మహిళల భద్రత, యువతకు స్కిల్ డెవలప్‌మెంట్, ఉద్యోగ అవకాశాలు, తాగునీటి పథకాలు, గ్రామీణ రహదారుల అభివృద్ధి, స్మార్ట్ గ్రామాల దిశగా కూటమి ప్రభుత్వం ముందడుగు వేస్తోందన్నారు. రానున్న ఐదు సంవత్సరాల్లో రాష్ట్రాన్ని మరింతగా అభివృద్ధి చేసేలా కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. గడిచిన సంవత్సర కాలంలో నియోజకవర్గంలో రోడ్లు, కాలువలు, మంచినీటి వసతి లాంటి అభివృద్ధి కార్యక్రమాలను చేశామన్నారు. ఇప్పటికే ఇచ్చిన హామీలలో 80శాతం హామీలను అమలు చేశామన్నారు. పింఛన్ల పెంపు, గ్యాస్ రాయితీ, మెగా డీఎస్సీ, తల్లికి వందనం పథకాలను అమలు చేశామని, వచ్చే నెల 15వ తేదీ నుండి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని అందజేస్తున్నామన్నారు. అలాగే రైతులకు అన్నదాత సుఖీభవ పథకాన్ని మూడు విడతలుగా అందించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయన్నారు. తొలి విడత ఈ నెలలోనే రైతుల ఖాతాల్లో జమ చేయనున్నట్లు చెప్పారు. రానున్న నాలుగు సంవత్సరాల్లో భారీగా నిధులు తెచ్చే విధంగా ప్రణాళికా బద్ధంగా పని చేస్తున్నామన్నారు. ఇది మొదటి అడుగు మాత్రమేనని రాబోయే నాలుగేళ్లు అభివృద్ధి పథంలో తిరుగులేని ప్రయాణం చేస్తామన్నారు. ప్రతి సమస్యకు పరిష్కారమే లక్ష్యంగా ప్రతి ఇంటికీ అభివృద్ధే గమ్యంగా పని చేస్తున్నామని పేర్కొన్నారు. పామర్రు టౌన్ 146,148,149,164,165,182 అసెంబ్లీ బూత్ లలో జరిగిన "సుపరి పాలనలో తొలి అడుగు అనే డోర్ 2 డోర్" కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కుమార్ రాజా తో పాటు కృష్ణా డెల్టా ప్రాజెక్ట్ కమిటీ వైస్ చైర్మన్, క్లస్టర్ హెడ్ వల్లూరుపల్లి గణేష్, పార్టీ సీనియర్ నాయకులు గొట్టిపాటి లక్ష్మీదాసు, పరసా సుబ్రహ్మణ్యం, యూనిట్ హెడ్‌లు, బూత్ కన్వీనర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కూచిపూడి పంచాయితీ కార్యదర్శిగా సోమేశ్వరరావు



**మొవ్వ (జూలై 2) మేజర్ న్యూస్ :** నాట్య క్షేత్రం కూచిపూడి గ్రామపంచాయతీ గ్రేడ్ -1 కార్యదర్శిగా కె.వి. సోమేశ్వరరావు (పూర్తి అదనపు బాధ్యతలు) బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు మొవ్వ మండల పరిషత్ అభివృద్ధి అధికారి డి. సుహాసిని ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటి వరకు పంచాయతీ కార్యదర్శిగా పనిచేసిన పుష్ప నాదం గత నెల 30న ఉద్యోగ విరమణ చేయడంతో కూచిపూడి పంచాయతీ కార్యదర్శి పోస్టు ఖాళీ అయింది. దీంతో మండల కేంద్రమైన మొవ్వ గ్రామ పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న కె.వి.సోమేశ్వరరావును పూర్తి అదనపు బాధ్యతల గ్రేడ్- 1 కార్యదర్శిగా నియమిస్తూ ఎంపీడీఓ ఉత్తర్వులు జారీ చేశారు.

## అకాల మరణం చెందిన వైసీపీ కార్యకర్త కుటుంబానికి ఆర్థిక సాయం



**పమిడిముక్కల జూలై 2 మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని చోరగుడి గ్రామంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అభిమాని చల్ల నాంచారయ్య అకాల మరణం చెందగా, పార్టీ తరపున మట్టి ఖర్చుల నిమిత్తం పామర్రు మాజీ శాసనసభ్యులు కైలే అనిల్ కుమార్ ఆర్థిక సహాయాన్ని స్థానిక నాయకుల ద్వారా అందజేశారు. మృతి చెందిన నాంచారయ్య కుటుంబ ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రంగా ఉండటంతో స్థానిక నాయకుల విన్నపం మేరకు అనిల్ కుమార్ ఐదు వేల రూపాయలను పార్టీ తరపున పంపారు. అలాగే స్థానిక ఎంపిటిసి సభ్యుడు మర్రి దుర్గారావు మరో మూడు వేల రూపాయలను ఆ కుటుంబానికి అందించారు. ఆ కుటుంబానికి అన్ని రకాలుగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అండగా నిలబడతామని ఈ సందర్భంగా ప్రకటించారు. ఈ కార్యక్రమంలో మర్రి దుర్గారావు, పార్టీ నాయకులు మర్రి బాబూరావు, బాసు రమేష్, అమ్మిరెడ్డి శివరామకృష్ణ, బంద్రపల్లి నాగరాజు, అదపా వెంకట్, నల్లజెర్ల సీతారామయ్య, చావా అనుదీప్, మాతంగి ప్రవీణ్, అదపా శివరామకృష్ణ, లోకం నరేష్, కనుమూరు నాగరాజు పాల్గొని వారి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

## గుడ్లవల్లేరు డిప్యూటీ ఎంపిడిఓ ఎజెఎల్ నరసింహారావు



**గుడ్లవల్లేరు జూలై 2 మేజర్ న్యూస్:** గుడ్లవల్లేరు డిప్యూటీ ఎంపిడిఓ(ఇన్చార్జ్ ఈఓపిఆర్డీ)గా గుడ్లవల్లేరు పంచాయతీ కార్యదర్శి ఎజెఎల్ నరసింహారావు బుధవారం బాధ్యతలు చేపట్టారు. డిప్యూటీ ఎంపిడిఓ టి.విజయసారథి ఇన్చార్జ్ ఎంపిడిఓగా పనిచేసి సోమవారం పదవీ విరమణ చేయడంతో డిప్యూటీ ఎంపిడిఓ గా ఎజెఎల్ నరసింహారావు నియామకం అయ్యారు. గుడ్లవల్లేరు పంచాయతీ కార్యదర్శి, డోకిపర్రు ఇన్చార్జ్ కార్యదర్శిగా వున్న ఎజెఎల్ నరసింహారావు డిప్యూటీ ఎంపిడిఓ బాధ్యతలు చేపట్టడంతో మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు

## వేదాద్రి శ్రీ యోగానంద లక్ష్మీనరసింహస్వామివారికి సమర్పించిన వస్త్రముల వేలం పాట



**జగ్గయ్యపేట /వేదాద్రి,జూన్ 2, మేజర్ న్యూస్ :** జగ్గయ్యపేట మండలం, వేదాద్రి గ్రామములో వేంచేసియున్న శ్రీ యోగానంద లక్ష్మీ నరసింహ స్వామి వారి దేవస్థానములో తొలి ఏకాదశి పర్వదినము రోజు అనగా ది. 06-07-2025 ఆదివారం ఉదయం 8.00 ల నుండి శ్రీ స్వామి వారి, అమ్మవార్ల వస్త్రములు బహిరంగ వేలము ద్వారా విక్రయించబడును. ఆసక్తి గలవారు వేలములో పాల్గొని పాట ముగిసిన వెంటనే పాడిన సొమ్ము చెల్లించి వస్త్రములు పొందగలరని దేవస్థాన వంశపారంపర్య ధర్మకర్త డాక్టర్ వెలగపూడి లక్ష్మణఇందిరాదత్తు, కార్యనిర్వహణాధికారి కానూరి సురేష్ బాబు ఒక ప్రకటనలో తెలియజేసినారు.

## కోర్టులో మీడియేషన్ను సద్వినియోగం చేసుకోవాలి

### జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి గోపీ



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** మీడియేషన్ అండ్ కన్సిలేషన్ ప్రాజెక్ట్ కమిటీ ఆదేశాలను సారం ఏపీఎస్ఎల్ఎస్ఏ ఆధ్వర్యంలో జూలై 1వ తేదీ నుండి 90 రోజులపాటు మీడియేషన్ ఫర్ ది నేషన్ అనే పేరుతో స్పెషల్ డ్రైవ్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సంస్థ అధ్యక్షులు గుట్టాల గోపి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ డ్రైవ్ లో భాగంగా జిల్లాలో ఉన్న అన్ని కోర్టులలో పెండింగ్ లో ఉన్న అన్ని రకాల సివిల్,ఎంసీ, డివిసి కేసులు మ్యారేజ్ డిస్ప్యూట్స్, చెక్ బౌన్స్ కేసులు, ఎం వి ఓ పిలు, రాజీ పడదగిన క్రిమినల్ కేసులు మీడియేషన్కు పంపబడతాయని, సదరు కేసులలో ఇరువర్గాల వారు సామరస్యంగా పరిష్కరించవలసిందిగా కోరారు. కావున న్యాయవాదులు కక్షిదారులు ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలని తెలిపారు.

## నిమ్మగడ్డ, ఆముదార్లంకలో పొలం పిలుస్తోంది

### ఎలుకల నిర్మూలనకు యాజమాన్య పద్ధతులు పాటించాలి



**చల్లపల్లి మేజర్ న్యూస్ :** చల్లపల్లి మండల పరిధిలోని నిమ్మగడ్డ, ఆముదార్లంక గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా రైతులతో క్షేత్ర సందర్శన చేపట్టి, సమావేశాలు నిర్వహించారు. ఈ సం దర్భంగా మండల వ్యవసాయశాఖ అధికారి కె. మురళీకృష్ణ మాట్లాడుతూ, ఈ ఏడాది నారుమడుల దశలోనే ఎలుకల ఉధృతి అధికంగా గమనించామనీ, రైతులు తక్షణమే తగు యాజమాన్య పద్ధతులను పాటించటం ద్వారా నారుమడులను కాపాడుకోవటంతోపాటు ఎలుకల నిర్మూలనపై ఖర్చును కూడా తగ్గించుకోవచ్చని తెలిపారు. బ్రోమోడయలోన్ మందును విషపు ఎరలుగా తయారుచేసుకుని 10 గ్రాముల చొప్పున చిన్నచిన్న పొట్లాలుగా కట్టి గట్ల వెంబడి పెట్టడం ద్వారా ఎలుకలు ఉధృతి అదుపులో ఉంటుందనీ, పొలంగట్లపై కలుపు లేకుండా శుభ్రం చేసుకోవటం ద్వారా ఎలుకల సంచారం, ఆవాసం తగ్గుతుందన్నారు. నారుమడి చుట్టూ వి ఆకారంలోని పక్షి స్థావరాలను రెండు, మూడు ఏర్పాటు చేసుకోవటం ద్వారా ఎలుకల సంచారం తగ్గుతుందన్నారు. ఘంటసాల కృషివిజ్ఞానకేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డా. సుధారాణి రైతులకు ఎలుకల నిర్మూలనపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్త డా.రేవతి, వీఏఏ సాయిచందు, రైతులు పాల్గొన్నారు.

## వివాహిత అదృశ్యం కేసు నమోదు



**పామర్రు జులై 2 మేజర్ న్యూస్ :** పామర్రు పోలీస్ స్టేషన్ పరిధిలో వివాహిత యువతి అదృశ్యమైనట్లు కేసు నమోదయింది. ఈ కేసుకు సంబంధించి ఎస్ఐ వి.రాజేంద్రప్రసాద్ అందించిన వివరాల ప్రకారం పామర్రు చౌదరిపేట ప్రతాప్ కాలేజీ రోడ్లో నివసిస్తున్న వాసిరెడ్డి హర్షవర్ధన్ భార్య యలమంచిలి నాగ వెంకట లక్ష్మీప్రసన్న (29) గత నెల 30వ తేది మధ్యాహ్నం 11:30 గంటల సమయంలో ఇంటి నుండి బయటకు వెళ్ళింది. తిరిగి ఇప్పటి వరకు ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. సమాచారం తెలిసినవారు పామర్రు పోలీస్ స్టేషన్ 9440796431 నెంబర్ కు సమాచారం ఇవ్వాల్సిందిగా ఆయన కోరారు.

## శ్రీ మహిషాసుర మర్దిని అమ్మవారికి ఆషాఢ సారె



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** మచిలీపట్నం చమ్మనగిరిపేట లో వేంచేసి ఉన్న మహిషాసుర మర్దిని సమేత కాశి విశ్వేశ్వర స్వామి దేవాలయము. బుధవారం శ్రీ మహిషాసుర మర్దిని అమ్మవారికి ఆషాఢ సారె 300 మంది సుహాసినిలతో సమర్పించారు ఆలయ అర్చకులు కందుకూరి చిట్టి బాబు, గట్టుపల్లి సాయి చరణ్ శర్మ విశేషమైన పూజలు చేసారు. ఆలయ ప్రధాన అర్చకులు చేబ్రోలు సాయి రామ్ కుమార్ ఆలయ చైర్మన్ తమ్మన రాధాకృష్ణ మూర్తి, కార్యదర్శి ఎండూరి సురేష్ ఆలయ ట్రెజరర్ చేబ్రోలు గాయత్రి, కమిటీ సభ్యులు చేబ్రోలు రాజ సులోచన, బాలాజీ, వాసు చేబ్రోలు కుమారి తదితరులు పాల్గొన్నారు

## జిల్లాలో పర్యటించిన కేంద్ర బృందానికి స్వాగతం పలికిన కలెక్టర్ డీ కే బాలాజీ





**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్ సర్వే నిమిత్తం జిల్లాకు విచ్చేసిన కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ డైరెక్టర్ రాజ్ ప్రియ్ సింగ్ బృందానికి జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ బుధవారం కలెక్టరేట్ లోని తన ఛాంబర్ లో మొక్కను అందించి స్వాగతం పలికారు. అనంతరం జిల్లా కలెక్టర్ తన చాంబర్లో కేంద్ర బృందంతో కలిసి అధికారులతో స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్ సర్వేపై సమీక్షించారు.ఈ సందర్భంగా గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ డైరెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో గ్రామీణ అభివృద్ధికి అవసరమైన సలహాలు, సూచనలు, సమస్యలు తెలియజేయాలని కలెక్టర్ తో పాటు ఇతర అధికారులను కోరారు.కృష్ణాజిల్లా డెల్టా ప్రాంతమని, ఇక్కడ వ్యవసాయం, మత్స్య సాగు అధికమని, వైవిధ్యం కలిగిన జిల్లాలో కలంకారి, రోల్డ్ గోల్డ్ నగల తయారీ, కూచిపూడి నృత్యం వంటి వాటికి ప్రసిద్ధి అని తెలిపారు. జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో జల జీవన్ మిషన్ పథకం ద్వారా ఇంటింటికి నీటి కొళాయి కనెక్షన్లు ఇచ్చి తాగునీరు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, అయితే సరఫరాకు అవసరమైన స్టోరేజ్ ట్యాంకులు ప్రధాన సమస్యగా ఉన్నట్లు తెలిపారు. అదేవిధంగా పేరుకుపోయిన చెత్తను సిమెంట్ ఫ్యాక్టరీలకు తరలించేందుకు పెద్ద మొత్తంలో భారీ వాహనాలు, వాటి నిర్వహణకు నిధులు అవసరమన్నారు. వ్యాపారం చేసుకునే డ్వాక్రా సంఘాల మహిళలకు అధిక రుణాలు మంజూరు, ఉత్పత్తి చేసిన వారి వస్తువులకు మార్కెటింగ్ సౌకర్యం కల్పించడం, వ్యాపార మెళకువలు కోసం శిక్షణ తరగతులు నిర్వహించడం కీలకమన్నారు.తీర ప్రాంతంలోని నేలల ప్రభావం వల్ల ఇళ్ల నిర్మాణ పునాది పటిష్టంగా నిర్మించేందుకు అధిక మొత్తంలో ఖర్చు చేయవలసి ఉందని, ఈ నేపథ్యంలో ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద ఇళ్ల నిర్మాణాలకు ఒక యూనిట్ కు అందించే రూ. 1.8 లక్షల నగదును పెంచాల్సినఅవసరం ఉందన్నారు. అదేవిధంగా గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన వివిధ అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులు మంజూరు కావాల్సి ఉందని, తగిన చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోరారు. కేంద్ర బృందం ప్రతినిధులు జిల్లాలోని వివిధ గ్రామాల్లో పర్యటిస్తూ మురుగుకాల్వలు, పారిశుధ్య పనులు, ఇంటింటికీ తాగునీరు, ఇంకుడు గుంతలు, మరుగుదొడ్లు, తడి, పొడి చెత్త నిర్వహణ, కంపోస్టు ఎరువు తయారీ వంటి అంశాలపై ప్రత్యేక ఫార్మాట్లో ప్రజల నుంచి వివరాలు తీసుకుంటున్నారు. ఆరోగ్యకేంద్రాలు, అంగన్వాడీ కేంద్రాల పనితీరు, వాటి ద్వారా అందుతున్న సేవలను పరిశీలిస్తున్నారు.ఈ సమావేశంలో కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ సెక్షన్ ఆఫీసర్ కేశవ్ రోజ్, జెడ్పీ సీఈవో కన్నమనాయుడు, డ్వామా పీడీ ఎన్వీ శివ ప్రసాద్ యాదవ్, డిఆర్డిఏ పిడి హరిహరనాథ్, గృహ నిర్మాణ సంస్థ పీడీ వెంకటరావు, పంచాయతీ రాజ్ ఎస్ఈ రమణరావు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

**గన్నవరం, జూలై 2, మేజర్ న్యూస్ :** ప్రజా సంక్షేమమే లక్ష్యంగా తమ ప్రభుత్వం ముందుకు సాగుతుందని ప్రభుత్వ విప్ గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్ తెలిపారు. నియోజకవర్గం కేంద్రమైన గన్నవరం గౌడపేటలో బుధవారం ఉదయం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా గౌడపేట లో పర్యటించిన యార్లగడ్డ ఇంటింటికి తిరుగుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత సంవత్సర కాలంలో చేపట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ప్రజల సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించాలని అధికారులు ఆదేశించారు. ఈ సందర్భంగా వెంకట్రావు మాట్లాడుతూ తమ ప్రభుత్వం అధికారం చేపట్టిన వెంటనే రాష్ట్రంలో అధ్వాన్నంగా ఉన్న రహదారుల పై గుంటలు పుడ్చే కార్యక్రమాన్ని చేపట్టినట్లు చెప్పారు. ఈ సంవత్సరకాలంలో రాష్ట్ర వ్యాప్తంగా రూ.12 వేల కోట్లు ఖర్చు చేసి 20వేల కిలోమీటర్ల రోడ్లను బాగు చేసినట్లు చెప్పారు. గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన చెత్త పన్నును రద్దుచేసి ప్రజలకు ఊరట కలిగించిన సంగతి గుర్తు చేశారు. 8.50 లక్షల మంది రైతుల వద్ద ధాన్యాన్ని కొనుగోలు చేసి రూ. 13.5 వేల కోట్లు చెల్లించామన్నారు. రైతుల సంక్షేమం కోసం అన్నదాత సుఖీభవ పథకాన్ని ఈ నెలలోనే అమలు చేస్తామన్నారు. వచ్చే నెల నుంచి రాష్ట్ర వ్యాప్తంగా మహిళలకు ఆర్టీసీ బస్సులు ఉచిత ప్రయాణం కల్పిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్ర ప్రజల శ్రేయస్ కోసం అహర్నిశలు శ్రమిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కు ప్రజలు అండగా నిలవాలని పిలుపునిచ్చారు.



ముందుగా పాత గన్నవరం లోని శ్రీ లక్ష్మీ తిరుపతమ్మ ఆలయంలో యార్లగడ్డ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షులు గూడపాటి తులసి మోహన్, టీడీపీ టౌన్ పార్టీ ప్రసిడెంట్ జాస్తి శ్రీధర్, బి ఎలా ఏ లు మోదుగుముడి వేణు, మోదుగుముడి సత్యనారాయణ, యూనిట్ ఇన్ ఛార్జ్ పల్లగాని కోటి, ఆళ్ల గోపాలకృష్ణ, మేడేపల్లి రామ, బోడపాటి రవి, కొమ్మరాజు సుధీర్, దయ్యాల రాజేశ్వరరావు, గొడ్డళ్ళ చిన్న రామారావు, అల్లా గోపాల కృష్ణ, పడమటి రంగారావు, పొదిలి లలిత, మూల్పూరి సాయి కళ్యాణి పరుచూరి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ ఫెన్సింగ్ పోటీలకు ఎంపికైన ఏకత్వా విద్యార్థులు



**నందిగామ, జూలై 2, మేజర్ న్యూస్:** ఉమ్మడి కృష్ణా జిల్లా వీరులపాడు మండలం పొన్నవరం గ్రామంలో గత సంవత్సర కాలం నుండి ఏకత్వా పాఠశాల కేంద్రంగా కోచ్ విజయ్ కుమార్ గోగులమూడి శిక్షణలో శిక్షణ పొందిన విద్యార్థులు జిల్లా స్థాయి ఫెన్సింగ్ పోటీల్లోనే కాకుండా రాష్ట్ర స్థాయి లోని వివిధ విభాగాలలో జరిగిన పోటీల్లో కూడా పాల్గొని సత్తా చాటి జాతీయ ఫెన్సింగ్ పోటీలకు ఎంపికయ్యారని పాఠశాల ఉప ప్రధాన ఉపాధ్యాయులు ఐశ్వర్య సాంబశివన్ బుధవారం తెలిపారు. వీరు ఇటీవల విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ కార్పొరేషన్ స్టేడియంలోని డిస్టిక్ స్పోర్ట్స్ అథారిటీ ఇండోర్ హాల్లో జరిగిన రాష్ట్రస్థాయి పోటీలలో విజేతలుగా నిలిచి నాసిక్ పట్టణం, మహారాష్ట్రలో జరగబోయే తొమ్మిదవ జాతీయ ఫెంసింగ్ పోటీలలో ఆంధ్రప్రదేశ్ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాలలో జరిగిన అభినందన కార్యక్రమంలో పాఠశాల ఫౌండర్ డైరెక్టర్ పాల్గొని జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థిని విద్యార్థులను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా మనోజ్ మాట్లాడుతూ ఫెన్సింగ్ క్రీడ అనేది ఒక పోరాట క్రీడ అని ఇటువంటి క్రీడలో తమ పాఠశాల విద్యార్థులు రాణించి విజేతలుగా నిలవడం ఎంతో గర్వకారణంగా ఉందని అన్నారు. బాలికల ఆత్మరక్షణకు అండగా నిలిచే ప్రత్యేక క్రీడ ఇది. కరాటే, తైక్వాండో వంటి క్రీడల ద్వారా ఆడపిల్లలకు రక్షణ ఉంటుందని తల్లిదండ్రులు భావిస్తున్నారు. ఇలాంటి కోవకు చెందిన ఆటే ఫెన్సింగ్ అని అన్నారు. ఈ సందర్భంగా ఎంతోమంది విద్యార్థులకు ఉత్తమ శిక్షణ ఇచ్చి జాతీయ క్రీడాకారులుగా తీర్చిదిద్దుతున్న పాఠశాల వ్యాయామ విద్య విభాగాధిపతి విజయ్ కుమార్ గోగులమూడిని ప్రత్యేకంగా అభినందించారు.

# దార్శనిక ప్రణాళికలపై స్పష్టమైన అవగాహన ఉండాలి



**ఎన్టీఆర్ జిల్లా బ్యూరో, జులై 2, మేజర్ న్యూస్ :** నియోజకవర్గాల దార్శనిక ప్రణాళికలోని ప్రతి అంశంపైనా స్పష్టమైన అవగాహన ఉండాలని, ఆయా నియోజకవర్గాల బలాలు, బలహీనతల విశ్లేషణ ద్వారా, వృద్ధికి అవకాశమున్న అంశాలపై ప్రత్యేకంగా దృష్టిసారించాలని కలెక్టర్ డా. జి.లక్ష్మీశ.. నియోజకవర్గాల ప్రత్యేక అధికారులు, వారి బృంద సభ్యులకు సూచించారు. జిల్లా, నియోజకవర్గ దార్శనిక కార్యాచరణ ప్రణాళికలపై కలెక్టర్ లక్ష్మీశ.. జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ, విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర హెచ్ఎంతో కలిసి బుధవారం కలెక్టరేట్ శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో ప్రత్యేక అధికారులు, ప్రణాళికల రూపకల్పన బృందాలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర ఏ 2047 లక్ష్యాల సాధనకు నియోజకవర్గాల దార్శనిక ప్రణాళికలు దోహదం చేస్తాయని, ఆయా నియోజకవర్గాల గ్రాస్ కన్‌స్టిట్యుయెన్సీ డొమెస్టిక్ ప్రొడక్ట్ (జీసీడీపీ)తో పాటు నియోజకవర్గ స్థూల విలువ జోడింపు, తలసరి ఆదాయాలను పెంచేందుకు వీటిని సద్వినియోగం చేసుకోవాల్సి ఉంటుందన్నారు. ప్రజల జీవన ప్రమాణాలను పెంచడంతో పాటు ఆర్థికవృద్ధిని వేగవంతం చేయడం దార్శనిక ప్రణాళికల లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రస్తుతమున్న రూ. 3.52 లక్షల జిల్లా తలసరి ఆదాయాన్ని 2047 నాటికి రూ. 55 లక్షలకు చేర్చాలనేది లక్ష్యమని.. ఈ లక్ష్యాన్ని చేరుకోవాలంటే స్పష్టమైన ప్రణాళికలతో పాటు వాటి అమలుకు ప్రతిఒక్కరూ సమష్టిగా కృషిచేయాల్సిన అవసరముందన్నారు. ఉదాహరణకు పశు పోషణ రంగంలో అధిక వృద్ధికి అవకాశముందని.. ఈ నేపథ్యంలో ఓ నియోజకవర్గంలో ప్రస్తుత పాల ఉత్పత్తి, పాల ఉత్పత్తిని పెంచడానికి ఉన్న అడ్డంకులు, వాటిని అధిగమించేందుకు అందుబాటులో ఉన్న పథకాలు, వాటిని సద్వినియోగం చేసుకోవడం ద్వారా జరిగే అదనపు సంపద సృష్టి.. ఇలా ప్రతి అంశంపైనా స్పష్టమైన అవగాహన ఉండాలని సూచించారు. పట్టణ ప్రాంతాల్లో సేవా రంగంపై ప్రత్యేక దృష్టిపెట్టాల్సిన అవసరముందని.. అదేవిధంగా గ్రామీణ ప్రాంతాల్లో పశు పోషణ, ఉద్యాన, ఆక్వా కల్చర్, పరిశ్రమలు తదితరాలపై దృష్టిపెట్టాల్సిన అవసరముందని సూచించారు.

**బంగారు కుటుంబానికి పీ4తో ఉన్నత భవిష్యత్తును నిర్మిద్దాం:** రాష్ట్ర ప్రభుత్వం పేదరిక నిర్మూలన లక్ష్యంగా ఎక్కడాలేని విధంగా వినూత్నంగా పీ4 విధానాన్ని అమలుచేస్తోందని.. ఈ విధానాన్ని విజయవంతంగా ముందుకు తీసుకెళ్లేందుకు అధికారులు కృషిచేయాలని సూచించారు. దశల వారీగా అభివృద్ధి ప్రణాళికలను అమలుచేయడం ద్వారా బంగారు కుటుంబాలను పేదరికం నుంచి బయటపడేలా చేయొచ్చని, ఇందుకు మార్గదర్శులను ప్రోత్సహించాలని సూచించారు. కేవలం డబ్బే కాకుండా ఓ మంచి సూచన, చేయిపట్టి నడిపించే సేవా తత్పరత, సమాజం మనకెంతో ఇచ్చింది.. మనమూ సమాజానికి తిరిగి ఎంతో కొంత చేయాలనే మంచి ఆలోచనలు.. బంగారు కుటుంబాల అభివృద్ధికి ఉపయోగపడతాయని వివరించారు. తాజాగా బంగారు కుటుంబాలను దత్తత తీసుకునేందుకు రోటరీ క్లబ్ సభ్యులు ముందుకొచ్చారని.. ఇదే స్ఫూర్తితో మిగిలిన వారు ఓ మంచి చొరవలో భాగస్వాములు కావాలని కలెక్టర్ లక్ష్మీశ పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సీపీవో వై.శ్రీలత, గ్రామ, వార్డు సచివాలయాల ప్రత్యేక అధికారి జి.జ్యోతి, నియోజకవర్గాల ప్రత్యేక అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# గత ఐదేళ్లు వైసీపీ వేదాద్రి - కంచల ఎత్తిపోతల పథకాన్ని మూలపడేసింది



**నందిగామ, జులై 2, మేజర్ న్యూస్ :** రైతులు, టీడీపీ నాయకులతో కలిసి వేదాద్రి – కంచల ఎత్తిపోతల పథకాన్ని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వర రావు బుధవారం నాడు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, టీడీపీ హయాంలో నిరాటంకంగా సాగిన ఎత్తిపోతల పథకం గత ఐదేళ్ల వైసీపీ హయాంలో మూలనపడిందన్నారు.గత వైకాపా ప్రభుత్వంలో నిధులు మంజూరు చేయకపోవడంతో మరమ్మత్తులు నోచుకోక మూలన పడిగా నందిగామ, జగ్గయ్యపేట నియోజకవర్గాలకు సాగునీరు అందించే వేదాద్రి – కంచల ఎత్తిపోతల పథకానికి కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిధులు కేటాయిస్తున్నట్లు ప్రకటించడంతో మోక్షం వచ్చిందన్నారు. దేవినేని వెంకట రమణ 1994లో ఎమ్మెల్యేగా ఎన్నికై, 1996-1999 మధ్య మంత్రిగా పనిచేసిన ఆయన హయాంలో వేదాద్రి వద్ద కృష్ణా నదిపై నిర్మించిన వేదాద్రి ఎత్తిపోతల పథకం స్థానిక ప్రజల తాగునీటి అవసరాలను తీర్చడంతో పాటు, నందిగామ నియోజకవర్గంలోని ఆయకట్టు చివరి గ్రామాలకు సాగునీరు అందించడంలో కీలక పాత్ర పోషించిందన్నారు. ఈ పథకం రైతులకు సాగునీటిని సమర్థవంతంగా అందించి, వ్యవసాయ ఉత్పాదకతను పెంచడంలో సహాయపడిందని గుర్తు చేశారు.దేవినేని ఉమ రైతులతో కలిసి వేదాద్రి ఎత్తిపోతల పథకాన్ని పరిశీలించి, అనంతరం ఏపీ ఐడీసీ, ఎన్ఎస్పి అధికారులతో మాట్లాడారు. వెంటనే పనులు ప్రారంభించేందుకు అధికారులు శ్రీకారం చుట్టారు. గత వైకాపా ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల ఈ పథకం మోటార్లు మరమ్మత్తులకు గురై పూర్తిగా ఆగిపోయిందన్నారు. దీనివల్ల రెండు నియోజకవర్గాల్లోని 36 గ్రామాల పరిధిలోని సుమారు 17వేల ఎకరాలకు సాగునీరు అందక పంటల పండక అన్నదాతల తీవ్రంగా నష్టపోయారు అని గుర్తు చేశారు. ఈ పరిస్థితుల్లో కూటమి ప్రభుత్వం రావడంతో ఇటీవల నందిగామ నియోజకవర్గం చందర్లపాడు మండలం ముప్పాళ్ళ గ్రామంలో పి4 కార్యక్రమానికి వచ్చిన రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి వేదాద్రి ఎత్తిపోతల పథకం దుస్థితిని ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యేలు తంగిరాల సౌమ్య, శ్రీరామ్ తాతయ్య లు తీసుకెళ్లిన విషయం గుర్తు చేశారు. వెంటనే స్పందించిన సీఎం 15 కోట్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు అని తెలిపారు.ఈ పరిస్థితుల్లో వేదాద్రి ఎత్తిపోతల పథకం ఈ ఖరీఫ్ సీజన్లో సాగునీరు అందించే విధంగా వెంటనే పథకం మోటార్లకు మరమ్మతులు చేయాలని విజ్ఞప్తి చేయగా, ఈ మేరకు వెంటనే పనులు ప్రారంభించేందుకు శ్రీకారం చుట్టినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో వివిధ హోదాలో ఉన్న కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఎక్స్‌పీరియన్స్ సెంటర్ పనులను త్వరితగతిన పూర్తిచేయాలి

**వీలైనంత త్వరగా పర్యాటకులకు అందుబాటులోకి తేవాలి**

**జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**




**ఎన్టీఆర్ జిల్లా బ్యూరో, జులై 2, మేజర్ న్యూస్ :** దేశ, విదేశాలలో ప్రత్యేక గుర్తింపు పొందుతున్న కొండపల్లి బొమ్మ ఔన్నత్యాన్ని నేటి తరానికి చాటిచెప్పేలా, భవిష్యత్తు తరాలకు వారసత్వ సంపదగా అందించేలా చేపట్టిన ఎక్స్‌పీరియన్స్ సెంటర్ పనులను త్వరితగతిన పూర్తిచేసి వీలైనంత త్వరగా పర్యాటకులకు అందుబాటులోకి తేవాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టర్ లక్ష్మీశ ఇబ్రహీంపట్నం మండలం, కొండపల్లిలో పర్యాటక, మున్సిపల్ శాఖల అధికారులతో కలిసి ఎక్స్‌పీరియన్స్ సెంటర్ పనులను పరిశీలించారు. కళాత్మక సౌందర్యం ఉట్టిపడేలా మ్యూరల్ పెయింటింగ్స్ పనులు పూర్తయ్యాయని.. లోపల భాగంలో కొన్ని పనులు మిగిలియున్నాయని అధికారులు వివరించారు. ఫెన్సింగ్ వంటి పనులను త్వరితగతిన పూర్తిచేయాలని ఈ సందర్భంగా కలెక్టర్ ఆదేశించారు. చారిత్రక, సాంస్కృతిక ఔన్నత్యమున్న జిల్లాను పర్యాటక హబ్‌గా తీర్చిదిద్దేందుకు కృషిచేస్తున్నామని, ఇందులో భాగంగా శతాబ్దాల చారిత్రక వారసత్వానికి సజీవ సాక్ష్యంగా ఉన్న కొండపల్లి బొమ్మ విశిష్టతను పర్యాటకులకు చాటిచెప్పేలా ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌ను అభివృద్ధి చేయడం జరుగుతుందన్నారు. కొండపల్లి బొమ్మ చారిత్రక వైభవం, బొమ్మల తయారీకి ఉపయోగించే తెల్ల పొణికి చెక్క ప్రాచుర్యాన్ని, బొమ్మలకు సంబంధించిన విశేషాలను పర్యాటకులకు కళ్లకు కట్టినట్లుగా తెలియజేసి ప్రత్యక్ష అనుభూతి పొందేలా ఎక్స్‌పీరియన్స్ సెంటర్ ఎంతో దోహదపడుతుందని కలెక్టర్ అన్నారు. కలెక్టర్ వెంట విజయవాడ ఆర్‌డీవో కావూరి చైతన్య, జిల్లా పర్యాటక అధికారి ఎ.శిల్ప, కొండపల్లి మునిసిపల్ కమిషనర్ రమ్య కీర్తన తదితరులు ఉన్నారు.

## గృహ నిర్మాణ లబ్ధిదారులు నిర్మాణం పూర్తి చేసుకోండి



**పెదపారుపూడి జూలై 2 మేజర్ న్యూస్:** రూఫ్ లెవెల్ వరకు గృహనిర్మాణములు చేసుకున్న గృహ నిర్మాణ లబ్ధిదారులు మిగిలిన నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేసుకోవాలని పెదపారుపూడి ఎంపీడీఓ జె.విమాదేవి కోరారు. బుధవారం వెంట్ర ప్రగడ గ్రామ పంచాయతీ కార్యాలయంలో లబ్ధి దారులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామంలో గతంలో ఇళ్ల నిర్మాణాలు మంజూరైన లబ్ధిదారులలో 45 మంది రూఫ్ లెవెల్ వరకు నిర్మాణాలు జరుపుకుని ఆగిపోయారని, మిగిలిన నిర్మాణాలు కూడా పూర్తి చేసుకుంటే ప్రభుత్వం నుండి రావలసిన మిగిలిన సొమ్ము విడుదల అవుతుందన్నారు. లబ్ధిదారుల కుటుంబ ఆర్థిక స్థితిగతులు ఆరా తీశారు. ప్రభుత్వం ఇచ్చిన అవకాశం సద్వినియోగం చేసుకుని ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకోవాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ వంగా శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి సాగరరాణి, హౌసింగ్ ఇంచార్జి ఏఈ ఫణికుమార్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ మహేష్, సృజన, గృహ నిర్మాణ లబ్ధిదారులు పాల్గొన్నారు.

## ఘనంగా రక్షణ సైన్యం దేవాలయ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



**పెదపారుపూడి జూలై 2 మేజర్ న్యూస్:** మండలంలోని వివిధ గ్రామాల్లో రక్షణ సైన్యం దేవాలయ ఫౌండేషన్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రమైన పెదపారుపూడితోపాటు వెంట్రప్రగడ, యలమర్రు, చినపారుపూడి, కొర్నిపాడు గ్రామాలలో రక్షణ సైనిక దేవాలయం మేజర్ విజయ్ కుమార్ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రక్షణ సైన్యం ఏర్పడి160 సంవత్సరాలైందని, రక్షణ నిధులు విద్య, వైద్య, సువార్త, సాంఘిక కార్యకలాపాలు నిర్వహించడంలో ముందుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మేజర్ రూతు కుమారి, సంఘ పెద్దలు దగాని జోసఫ్, నత్తా భూషణ్ కుమార్, గృహంతి స్త్రీలు పీక పద్మ, గుమ్మడి ఏసు మరియమ్మ, సంఘస్తులు తదితరులు పాల్గొన్నారు.

## సుపరిపాలన - తొలి అడుగు



**నాగాయలంక జులై/2 మేజర్ న్యూస్:** నాగాయలంక మండలం చోడవరం గ్రామపంచాయతీ పరిధిలో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో సూపర్ సిక్స్ ప్రభుత్వ పథకాలు సేవలు గ్రామస్తులకు అందుతున్న విధానాలపై అభిప్రాయాలు తీసుకొనుచు వారి సమస్యలు వినుచు కృష్ణాజిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కొనకళ్ల నారాయణరావు అవనిగడ్డ నియోజకవర్గ పరిశీలకులు కనపర్తి శ్రీనివాసరావు పారిశ్రామికవేత్త బొబ్బా.గోవర్ధన్ దివిసీమమార్కెట్ కమిటీ చైర్మన్ కొల్లూరివెంకటేశ్వరరావు మాజీ మార్కెటింగ్ యాడ్ చైర్మన్ మండవబాలవర్ధినరావు నాగాయలంక మండల తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు మెండు.లక్ష్మణరావు తలశిల వెంకట నరసింహారావు కార్యకర్తలు గ్రామ నాయకులు కలిసి ప్రచారం నిర్వహించారు.

## తాడిగడపలో పర్యటించిన
## జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, ఎంఎల్ఏ బోడె ప్రసాద్



**కంకిపాడు మేజర్ న్యూస్ :** బుధవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ పెనమలూరు శాసన సభ్యులు బోడె ప్రసాద్ తో కలిసి పెనమలూరు మండలం, తాడిగడపలో పర్యటించారు. రహదారులు భవనాలు, ఇరిగేషన్, రెవెన్యూ శాఖల అధికారులతో ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి సమీపంలో బందరు కాలువపై వంతెన నిర్మాణం గురించి స్థల పరిశీలన చేశారు.తొలుత తాడిగడప సెంటర్లోని వంతెన పరిశీలించి అక్కడ నుండి ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి కాలువ గట్టు రహదారి వెంబడి ఇరువురు నడుచుకుంటూ కట్టకు ఇరువైపులా ఉన్న ఆక్రమణలను పరిశీలించారు. అనంతరం వారు ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రికి చేరుకుని వంతెన నిర్మాణానికి సంబంధించిన ప్రతిపాదనలపై మ్యాపులను పరిశీలించి చర్చించారు.ఉయ్యూరు ఆర్డీవో బీఎస్ హేలా షారోన్, ఇరిగేషన్ శాఖ ఎస్ఈ మోహన్ రావు, రహదారులు భవనాలు ఎస్ఈ భాస్కరరావు, తాడిగడప మున్సిపల్ కమిషనర్ షేక్ నజీర్, కంకిపాడు మండలం తహసిల్దార్ గోపాలకృష్ణ, ఇంజనీరింగ్ అధికారులు తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.

# జిల్లాలో తొమ్మిది లక్షల మందికి యోగాను చేరువచేశాం





**సమష్టి కృషి ఫలితమైన ఈ విజయాన్ని స్ఫూర్తిగా తీసుకుందాం**

**అందరి జీవితాల్లో యోగా భాగమయ్యేలా ప్రోత్సహిద్దాం**

**అమరావతి యోగా జిల్లాకు ఓ మంచి సంపద**

**జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**

**ఎన్‌టీఆర్ జిల్లా, జులై 02, మేజర్ న్యూస్ :** యోగాంధ్ర–2025 ద్వారా జిల్లాలో తొమ్మిది లక్షల మందికి యోగాను చేరువచేశామని.. సమష్టి కృషి ఫలితమైన ఈ విజయంలో అమరావతి యోగా అండ్ ఏరోబిక్స్ అసోసియేషన్ కీలక భాగస్వామ్యం అందించిందని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. అమరావతి యోగా అండ్ ఏరోబిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏప్రిల్ 24 నుంచి జూన్ 12 వరకు ఉచిత వేసవి యోగా శిక్షణ శిబిరం జరిగింది. ఈ శిబిరంలో పాల్గొన్న 108 మందికి సర్టిఫికెట్లు అందించే కార్యక్రమం బుధవారం ఇందిరాగాంధీ మునిసిపల్ కార్పొరేషన్ స్టేడియంలోని అసోసియేషన్ కార్యాలయంలో జరిగింది. కార్యక్రమానికి కలెక్టర్ లక్ష్మీశ ముఖ్య అతిథిగా హాజరై సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో యోగాంధ్ర కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్లడంలో, బీఆర్‌టీఎస్ యోగా స్ట్రీట్‌లో ప్రత్యేక యోగా శిబిరాలు నిర్వహించడంలో అమరావతి యోగా కీలకపాత్ర పోషించిందని.. ఈ సంస్థ జిల్లాకు ఓ మంచి సంపద అని పేర్కొన్నారు. ఆరోగ్యకర సమాజ నిర్మాణానికి స్వచ్ఛమైన, మంచి ఆలోచనలు అవసరమని.. గొప్ప ఆలోచనలకు ఆస్కారం కల్పించేలా శారీరక, మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించే సత్తా యోగాకు ఉందని.. ఇంత మంచి సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్తున్నందుకు అసోసియేషన్‌కు ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు తెలిపారు.

**నెగెటివ్ ఆలోచనలు దూరం:** యోగా సాధన వల్ల నెగెటివ్ ఆలోచనలు దూరమై.. తనువు, మనసంతా పాజిటివిటీతో నిండిపోతుందని.. దీనిద్వారా ఆరోగ్యకర సమాజ నిర్మాణం జరుగుతుందని కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. జిల్లాలో ఖాళీ స్థలాలు, పార్కుల్లో యోగా సాధనకు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. యోగాను ఒక వ్యాయామంగా మాత్రమే కాకుండా జీవితంలో ఒక భాగంగా చూడాలని గౌరవ ముఖ్యమంత్రి చెబుతుంటారని.. శారీరకంగా ఆరోగ్యంగా ఉండటమే కాకుండా మానసికంగానూ బలంగా ఉండాలంటే అది ఒక్క యోగాతోనే సాధ్యమని కలెక్టర్ లక్ష్మీశ పేర్కొన్నారు. కార్యక్రమంలో అమరావతి యోగా అండ్ ఏరోబిక్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు మిరియాల వెంకటేశ్వరరావు, అసోసియేషన్ ఉపాధ్యక్షుడు దాసరి కాశీవిశ్వనాథ్, రిటైర్డ్ డీసీపీ హరికృష్ణ, కార్యదర్శి పీవీ రమణ, కోశాధికారి ఎ.లావణ్యకుమార్, యోగా గురువు అంకాల సత్యనారాయణతో పాటు యోగా సాధకులు, అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డుపైన వర్షపు నీటి నిల్వలు ఉండరాదు





**వర్షాకాలం దృశ్య అధికారులు అప్రమత్తంగా ఉంటూ తగిన చర్యలు తీసుకోవాలి**

**విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర**

**విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** వర్షాకాలం దృశ్య అధికారులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూ వర్షపు నీటి నిలువలు రోడ్డుపైన ఉండకుండా తగిన చర్యలు తీసుకోవాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. బుధవారం ఉదయం తన పర్యటనలో భాగంగా ప్రకాశం బ్యారేజ్ నుండి రామవరప్పాడు రింగ్ వరకు, ఏలూరు రోడ్డు లలో పారిశుధ్య నిర్వహణ, కృష్ణలంక, రాణి గారి తోట, ఈఎస్ఐ హాస్పిటల్ రోడ్డు, డెంటల్ కాలేజ్ రోడ్డు పరిసర ప్రాంతాలన్నీ పర్యటించి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వర్షాకాలం దృశ డిసిల్టింగ్ పనుల్లో ఎటువంటి జాప్యం ఉండరాదని అన్నారు. డెంటల్ కాలేజ్ వద్ద పేరుకుపోయిన వ్యర్థాలను, సిల్ట్ ను చూసి త్వరతగతిన పూర్తిచేసి మురుకు నీరు పారుదలకు ఎటువంటి అంతరాయం లేకుండా చూసుకోవాలని, అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుండాలని అన్నారు పారిశుధ్య నిర్వహణలో ఎటువంటి అలసత్వం ఉండరాదని నగరాన్ని పరిశుభ్రంగా ఉంచాలని అన్నారు. తదుపరి కృష్ణలంక, రాణి గారి తోటలో ఉన్న అన్న క్యాంటీన్ ను పరిశీలించారు. ఆహారంలో నాణ్యత, సమయపాలన, పారిశుధ్య నిర్వహణలో ఎటువంటి లోపం లేకుండా నోడల్ ఆఫీసర్లు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుండాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సామ్రాజ్యం, అసిస్టెంట్ సిటీ ప్లానర్ మోహన్ బాబు, బయాలజిస్ట్ కామేశ్వరరావు, ఇంజనీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

# నేరాల అదుపు కోసమే కార్డన్ సెర్చ్ : డీఎస్పీ శ్రీవిద్య





**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** నేరాలు అదుపులో ఉంచేందుకే కార్డన్ సెర్చ్ ఆపరేషన్లు నిర్వహిస్తుంటామని అవనిగడ్డ డిఎస్పి శ్రీవిద్య తెలిపారు. బుధవారం అవనిగడ్డ సబ్ డివిజన్ పరిధిలోని పులిగడ్డ గ్రామంలో నిర్వహించిన కార్డన్ చర్చ్ లో సరైన పత్రాలు లేని 27 బైకులు ఒక ఆటో ను గుర్తించినట్లు తెలిపారు. కృష్ణ జిల్లా ఎస్పీఆర్. గంగాధర రావు ఉత్తర్వుల మేరకు చేపట్టిన ఈ కార్యక్రమంలో అవనిగడ్డ, చల్లపల్లి సర్కిల్ ఇన్స్పెక్టర్లు, ఐదుగురు ఎస్ఐలు, సుమారు 75 మంది పోలీస్ సిబ్బందితో కార్డన్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించామని తెల్లవారుజామున 03:00 గంటలకు ప్రారంభమైన ఈ కార్యాచరణ 04 గంటలు నిర్విరావంగా సాగిందని, పోలీస్ సిబ్బందిని 5 సెర్చ్ పార్టీలు, 6 కట్ ఆఫ్ పార్టీలు గ్రామ సరిహద్దుల్లో ఏర్పాటు చేసి, 3 లిఫ్టింగ్ పార్టీలను కూడా నియమించుకొని, ప్రతి ఇల్లు, వ్యక్తులు, వాహనాలు, అనుమానాస్పద కార్యకలాపాల గురించి పరిశీలించారు. మొత్తంగా ఈ కార్డన్ సెర్చ్ ఆపరేషన్ లో 197 ఇళ్లను తనిఖీ చేయగా, సదరు ఇళ్ళలో నివసించే వారి వద్ద సరైన గుర్తింపు కార్డులు ఉన్నవి. అక్కడ అనుమానాస్పద వ్యక్తులు ఎవరు లేరు. వాహనములను తనిఖీ చేయగా 27 బైక్లు, 1 ఆటో రిక్షాకు సరైన పత్రములు లేనివిగా గుర్తించి వాటిని సీజ్ చేశారు. ఈ వాహనాలను అవనిగడ్డ పోలీస్ స్టేషన్కు తరలించి, అక్కడ భద్రపరిచినట్లు వివరించారు. ఈ కార్యాచరణ యొక్క ముఖ్య ఉద్దేశ్యం బలమైన చట్టపరమైన చర్యలు తీసుకోవడం ద్వారా ప్రజల విశ్వాసాన్ని పెంచడంతో పాటు శాంతిభద్రతకు అందుబాటులో ఉండడమే మా లక్ష్యంగా పనిచేస్తున్నామని డి.ఎస్.పి తెలిపారు.

## గద్దె ఫౌండేషన్ ద్వారా నలుగురికి ఆర్థిక సాయం



**విజయవాడ తూర్పు, మేజర్ న్యూస్ :** ప్రజాసేవకు ప్రాధాన్యత ఇస్తూ విద్య, వైద్యం, ఇతర ఖర్చుల నిమిత్తం గద్దె ఫౌండేషన్ ద్వారా టీడీపీ యువ నాయకులు గద్దె క్రాంతి కుమార్ నలుగురు లబ్ధిదారులకు రూ. 42,000 సహాయం అందించారు. ఈ సందర్భంగా గద్దె క్రాంతి కుమార్ మాట్లాడుతూ పేద ప్రజల అభ్యున్నతి కోసం తన తండ్రి గద్దె రామమోహన్ నిత్యం సహాయాలు అందిస్తూ ప్రజా సేవలో ముందుకు సాగుతున్నారని అన్నారు. ఆ మార్గాన్నే అనుసరిస్తూ తాను కూడా సేవా కార్యక్రమాలు చేస్తున్నానని అన్నారు. ఈ ఆర్థిక సహాయాలను 15వ డివిజన్‌కు చెందిన గాదం సీతామహాలక్ష్మికి వైద్యం నిమిత్తం రూ. 10 వేలు, ఆరో డివిజన్ కు చెందిన పరిమి సౌజన్యకు కాలేజీ ఫీజు నిమిత్తం రూ. 20 వేలు, 12వ డివిజన్ చెందిన కె.భవానీకి చదువు నిమిత్తం రూ.5 వేలు, 9వ డివిజన్ కు చెందిన కొక్కిలిగడ్డ వెంకటరత్నం చనిపోగా వారి కుటుంబ సభ్యులకి రూ. 5 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమాలలో సింగంశెట్టి రమేష్, గాదిరెడ్డి అమ్ములు, యలమంచిలి దేవేంద్ర, చిలకలపూడి లక్ష్మీనారాయణ, పాగోలు సత్యనారాయణ, నిమ్మల హైమా, వంశీ తదితరులు ఉన్నారు.

## రెడ్డిగూడెంలో ఉపాధి హామీపై అవగాహన ర్యాలీ




**రెడ్డిగూడెం, జులై 2, మేజర్ న్యూస్:** డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు ఎస్ ఎస్ ఏ ఏ టి డైరెక్టర్ జి శ్రీకాంత్ పర్యవేక్షణలో రెడ్డిగూడెం గ్రామపంచాయతీలో, సామాజిక తనిఖీ బృందం ఐ ఈ సి, ఇన్ఫర్మేషన్ ఎడ్యుకేషన్, కమ్యూనికేషన్ బృందం ద్వారా, గ్రామస్థాయిలో ఉపాధి శ్రామికులకు ఉపాధి హామీ పథకం యొక్క హక్కులు, సౌకర్యాలు, రాజీలేని అంశాలు, వేతన రేటు, ఎంపిక చేయబడిన పనులు, సామాజిక తనిఖీ గురించి అవగాహన ర్యాలీని బుధవారం నిర్వహించారు. ఈ ర్యాలీకి ముఖ్య అతిథిగా మండల టీడీపీ నాయకులు ముప్పిడి నాగేశ్వర రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకాన్ని మరింత లోతుగా ప్రజల్లోకి తీసుకువెళ్లి, వారికి అవగాహన కల్పించి, ప్రతి కుటుంబం 100 రోజులు పని చేసుకొని, వారి జీవనోపాధిని మెరుగుపరుచుకోవాలన్నారు. ఉపాధి హామీ పథకానికి కూటమి ప్రభుత్వం అందిస్తున్న మద్దతును, పెరిగిన వేతనాలు, మౌలిక సదుపాయాలను వివరించారు. ఈ పథకం పేదల బతుకులో వెలుగు పంచుతోందన్నారు. ఈ కార్యక్రమంలో సోషల్ ఆడిట్ ఎస్ఆర్‌పివి.కనకారావు, డిఆర్‌పిలు, ఏపీవో, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

## జిల్లా కలెక్టరు, డీపీఓలను కలసిన ఎంపీడీఓ ఇమ్రాన్



**గుడ్లవల్లేరు మేజర్ న్యూస్ :** గుడ్లవల్లేరు మండల అభివృద్ధి అధికారిగా పూర్తి అదనపు బాధ్యతలు చేపట్టిన ఎండి ఇమ్రాన్ బుధవారం మచిలీపట్నంలోని ఛాంబర్లో జిల్లా కలెక్టర్ డికె బాలాజీ, జిల్లా పంచాయతీ అధికారి అరుణ లను మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందచేసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్, డిపిఓ లు మండలంలో అందరినీ సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలని కోరుతూ ఎంపిడిఓ ఇమ్రాన్ ను అభినందించారు.

విలేకరులు కావలెను

నేటి దినపత్రిక సూర్య నందు చందర్లపాడు, ఇబ్రహీంపట్నం, ఏ.కొండూరు, మైలవరం, విసన్నపేట, గంపలగూడెం మండలాల్లో పని చేయుటకు విలేకరులు కావలెను.

ఇట్లు ఎన్.వెంకట్, ఎన్టీఆర్ - కృష్ణా బ్యూరో
ఫోన్ : 9642 980 999